క్లుప్తంగా

సానిగూడెంలో నిర్మాణాలు పూర్తి



సానిగూడెంలో నిర్మాణం పూర్తయిన ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్‌వెల్‌నెస్ సెంటర్

దెందులూరు: సానిగూడెం గ్రామంలో రూ. 22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ. 22 లక్షలతో వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్, రూ. 40 లక్షలతో సచివాలయం భవనాల నిర్మాణం పూర్తయ్యాయని సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నిధులు మంజూరు చేయించినందుకు చిరకాలం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేతులు మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుందని సర్పంచ్ విష్ణు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రాన్సిస్ అన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారీపై అవగాహన

పెదపాడు: గ్రామ పంచాయతీ స్థాయిలో అభివృద్ధి ప్రణాళిక తయారీలో ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రహదారులు అభివృద్ధి వీధి దీపాల నిర్వహణ, శానిటేషన్, వివిధ అభివృద్ధి పనుల నిర్వహణ వంటి వాటి నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామాల అవసరాలను వాటి అమలు చేసే ప్రణాళికలను తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తేజ రతన్, ఈఓ ఆర్డీ సూర్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: మండలంలోని గుడిపాడులో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మంది వ్యక్తుల నుంచి రూ.46,160 స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నిందితులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.

వృద్ధులకు కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు అందుకున్న పేదలు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పేదలకు ఉన్నత స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని కార్పొరేటర్ తంగెళ్ల రాము కొనియాడారు. గురువారం 15 డివిజన్‌లో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాము మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.20 లక్షల ఖరీదైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష తదితర కార్యక్రమాల ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు ఎనలేని సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. సేవలు పొందే ప్రజలు ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా పేదలకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అబ్బిరెడ్డి రంగముత్యాలు, ఎలగ అన్నవరం, కె.జయరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

విజయవాడ సభకు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు

పెదపాడు: విజయవాడలో సామాజిక సమతా సంకల్పం భారతరత్న డాక్టరు బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెదపాడు మండలంలోని 22 గ్రామ సచివాలయాల నుంచి సచివాలయం నుంచి 50 మంది చొప్పున బయలుదేరనున్నారు. విగ్రహావిష్కరణకు బయలుదేరే వారికి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశారు. వీరితో పాటు వేలాది మంది అభిమానులు నాయకులు తమ తమ సొంత వాహనాల్లో సభకు వెళ్లనున్నారు.

కులగణన సర్వేకు ఏర్పాట్లు పూర్తి

నూజివీడు: నేటి నుంచి మండలం, పట్టణంలో నిర్వహించనున్న కులగణన సర్వేకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో వీఏ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ తెలిపారు. దీనిలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉండే సెక్రటరీలకు క్లస్టర్‌లను కేటాయించామని, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కులగణన సర్వే నిర్వహిస్తారన్నారు. తర్వాత సామాజిక, ఆర్థిక పరిస్థితులు అన్నింటిని నమోదు చేసుకుని యజమాని, వలంటీర్, సెక్రటరీలు ఈకేవైసీ చేస్తారని, అప్పుడే ఆ కుటుంబం కులగణన సర్వే పూర్తయినట్లన్నారు. కులగణనకు గానూ నూజివీడు మండలం వలంటీర్లు, సెక్రటరీలు కలిసి దాదాపు 650 మందిని నియమించామన్నారు. అలాగే ఐదుగురు మండల స్థాయి అధికారులను సూపర్‌వైజర్లుగా నియమించినట్లు వివరించారు. పట్టణంలో దాదాపు 400 మందిని కులగణన సర్వేకు నియమించామన్నారు. నేటి నుంచి జరిగే కులగణన సామాజిక ఆర్థిక స్థితి సర్వేకు ప్రజలందరూ సహకరించాలని, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు తోడ్పాటును అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి పథంలో గణపవరం మండలం

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



గణపవరం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

గణపవరం: అభివృద్ధి పథంలో గణపవరం మండలం దూసుకుపోతోందని, ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయమే కారణమని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అభినందించారు. గురువారం సాయంత్రం గణపవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అర్ధవరం రాము అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలిస్తోందని, ఇది తట్టుకోలేని ఒకవర్గం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తయిన గ్రామాల్లో ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశామని, దీనికి సంబంధించిన పనులు వెంటనే పూర్తిచేయాలని సూచించారు. మండలానికి విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్ కింద రూ.45 లక్షలు మంజూరయ్యాయని, వారం రోజుల్లో ఇంకో రూ.45 లక్షలు విడుదలవుతాయని చెప్పారు. ఈ నిధులను మార్చి 31వ తేదీలోగా ఖర్చు చేసుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు. ఈనెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆసరా పథకం ద్వారా గణపవరం మండలంలో లబ్ధిదారులకు రూ.9.33 కోట్లు బ్యాంకు ఖాతాలలో జమ చేయనున్నారని వెల్లడించారు.

ఎన్నికల కోడ్‌కు ముందే పనులు పూర్తిచేయాలి

ఎంపీపీ అర్ధవరం రాము మాట్లాడుతూ గణపవరం మండలంలో గత మూడేళ్లకాలంలో రూ.2.23 కోట్ల విలువైన పనులు చేపట్టగా, రూ.2.10 కోట్ల చెల్లింపులు జరిగాయని, మిగిలిన రూ.13 లక్షలు త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. ఎన్నికల కోడ్ రాకముందే పనులన్నీ పూర్తి చేసుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు. ఎంపీడీఓ జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకొని, గ్రామ, వార్డు సభలు ఏర్పాటుచేయాలని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మార్చి 31లోగా ఖర్చుచేయాలని, లేకుంటే అవి వెనక్కి వెళ్లిపోతాయని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశలో క్రానిక్ ఓపీ ఏర్పాటు చేసిందని, క్యాన్సర్, కిడ్నీ, థైరాయిడ్ వంటి సమస్యలున్న వారికి పరీక్షలు చేసి అవసరమైన మందులు ప్రతి నెలా ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న చెప్పారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ తులసి మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, వైస్ ఎంపీపీ సలాది దుర్గా రత్నకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు రాము, తహసీల్దార్ పమ్మి లక్ష్మి పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం



సరిపల్లెలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా మహాత్మాగాంధీ కోరుకున్న గ్రామ స్వరాజ్యం కల నెరవేరిందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం సాయంత్రం గణపవరం మండలం సరిపల్లె గ్రామంలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్ర భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్, మండల సర్పంచ్‌ల చాంబర్ చైర్మన్ చనుమూరి లక్ష్మీ భవాని అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో వాసుబాబు మాట్లాడారు. ప్రజలకు గ్రామ సచివాలయంలోనే అన్నిరకాల సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలకు అవసరమైన సచివాలయ భవనాలు, గ్రామ ఆరోగ్య కేంద్రాలు, రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు నిర్మించామని వివరించారు. హామీలను నూరు శాతం నెరవేర్చిన చరిత్ర తమ ప్రభుత్వానిదని, అధికారం కోసం కల్లబొల్లి హామీలతో బయలుదేరిన జిత్తులమారుల మాటలు నమ్మవద్దని కోరారు. ఈ ఐదేళ్లకాలంలో ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలు బేరీజు వేసుకుని వచ్చే ఎన్నికలలో మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, వైస్ ఎంపీపీ సలాది దుర్గా రత్నకుమారి, ఎంపీడీఓ జ్యోతిర్మయి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పీఆర్ ఏఈ ముప్పిరిశెట్టి శ్రీనివాస్, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఏఓ యర్రంశెట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు రాము, గ్రామ అధ్యక్షుడు దగ్గు నాగేంద్ర, పార్టీ నాయకులు చనుమూరి శివ, తెనాలి సునీల్, బుద్ధారపు పుల్లయ్య, అల్లాడి రఘు, పుప్పాల సాయి, మాజీ సర్పంచ్‌లు చనుమూరి పోతరాజు, గేదల పాండు, సర్పంచ్‌లు ముచ్చర్లవేణు, ఆదిమూలం సురేష్, మూర అలంకారం, ఎంపీటీసీ సభ్యులు గురదాసు బుజ్జమ్మ, బత్తి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ జీఓను రద్దు చేయాలి



భీమడోలు జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న డ్రైవర్లు, హెల్పర్ల సంఘం నాయకులు

భీమడోలు: కేంద్ర ప్రభుత్వం ట్రక్ ఆటో డ్రైవర్లపై తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ జీఓను వెంటనే రద్దు చేయాలని కోరుతూ గురువారం జయహో రథసారధి డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా నాయకులు భీమడోలు జంక్షన్‌లో ఆందోళన చేశారు. దేశ వ్యవస్థకు మూలస్తంభాలైన డ్రైవర్లపై ఇలాంటి జీఓ తీసుకురావడం అన్యాయమని పేర్కొన్నారు. యాదృచ్ఛికంగా జరిగే రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లపై పెద్ద శిక్ష విధించడం దారుణమని వాపోయారు. రవాణా రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న తమకు జీవనోపాధి కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ జీఓను రద్దు చేయకుంటే దేశ వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని జిల్లా నాయకులు పేరాబత్తుల శ్రీనివాసరావు, బి.అభి హెచ్చరించారు. తొలుత భీమడోలు ఆటో యూనియన్ నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇంటిపల్లి నాగేంద్రరావు, ఇండేటి గోవర్ధన్, చిన్నం నాగేశ్వరరావు, ఎం.విఘ్నేశ్వరరావు, కె.సురేష్, బి.శ్రీను, ఎస్ చంటి, పి.ఏసు, కల్యాణ్, కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



నిడమర్రులో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీను

నిడమర్రు: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిడమర్రు ఎస్సై ఆర్ శ్రీను తెలిపారు. గురువారం నిడమర్రు కూడలిలో వాహన తనఖీల్లో భాగంగా వేగంగా, లైసెన్స్ లేకుండా, ట్రిపుల్ రైడింగ్‌తో వెళ్లే పలువురు యువతను, విద్యార్థులను నిడమర్రు పోలీసులు ఆపి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, ఏదైనా యాక్సిడెంట్ చేస్తే ఎ-1 ముద్దాయిగా పోలీస్ కేసులో ఇరుక్కుంటారని, దీంతో ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం కోల్పోతారని వివరించారు. స్నేక్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, అతివేగంగా, బీమా లేని వాహనాలు నడపరాదని, చిన్న దూరమైనా హెల్మెంట్ ధరించే వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నిడమర్రు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

శాస్త్రవేత్త శ్రీనివాసరావుకు ఘన సత్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న గ్రామస్తులు, ప్రముఖులు

ఉంగుటూరు: చెమటతో సుగర్ పరీక్ష చేసే యంత్రాన్ని కొనుగొన్న యువ శాస్త్రవేత్త వూసా చిరంజీవి శ్రీనివాసరావు అభినందనీయుడని పలువురు వక్తలు అన్నారు. గ్రామంలోని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నారాయణపురంలో గురువారం సర్పంచ్ దిడ్ల అలకానంద ఆధ్యక్షతన శాస్త్రవేత్త శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాసరావు కనుగొన్న పరికరంతో యావత్తు ప్రపంచం అతని వైపు చూసిందన్నారు. శాస్త్రవేత్త శ్రీనివాసరావు మాట్లాడుతూ తన విజయం వెనుక తన తల్లి దుర్గ కష్టం ఎంతో దాగి ఉందన్నారు. తనకు సొంతగ్రామంలో జరిగిన ఈ సత్కారం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రిటైర్డు మెజిస్ట్రేటు బొమ్మిడి అప్పారావు, కైకరం సర్పంచ్ శనగల గోపి, మాజీ సర్పంచి యాళ్ల సుజీవరావు, గ్రామస్తులు పాతూరి సత్యనారాయణ, పుసులూరి ప్రకాష్, నల్ల ఆనంద్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

పెదపాడు: గౌడ సేవా సమితి ద్వారా ప్రతి నెలా రెండు గౌడ పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఏలూరు గౌడసేవాసమితి జనరల్ సెక్రటరీ న్యాయవాది, బైగాని రంగారావు తెలిపారు. గురువారం వేంపాడు గ్రామానికి చెందిన చిట్టిమాది సాయి ప్రసాద్ కిడ్నీ వ్యాధితో జనవరి 1న మరణించడంతో వారి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. దీంతో పాటు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గురై చికిత్స పొందుతున్న అమ్మపాలెం గ్రామానికి చెందిన బాలిన సురేష్‌కు రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మార్గాని సురేష్ పరసా శ్రీనివాస్ పరసా నాగ శ్రీనివాసరావు, పరసా మోహన్ గౌడ్, నూతి రవిగౌడ్, సురగాని శ్రీనివాసరావు, వీరంకి అయ్యప్ప పాల్గొన్నారు.

ఎంపీడీఓను కలిసిన పంచాయతీ కార్యదర్శులు

పెదపాడు: పెదపాడు నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన జె.తేజరతన్‌ను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మేకా శ్రీనివాస్, ఎం వెంకటేశ్వరరావు, పీవీ రమణ, పద్మారావు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎంపీపీ

పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి పెదపాడు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన తేజరతన్‌కు గురువారం పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకుడు బత్తుల ఏసురాజు పాల్గొన్నారు.

విజయవాడకు తరలిరావాలి

దెందులూరు: విజయవాడలో శుక్రవారం 206 అడుగుల ఎత్తులో దేశంలో ఎక్కడా లేనివిధంగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి ప్రారంభోత్సవం చేస్తున్న సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామాజిక న్యాయం పౌరులందరి హక్కుల రక్షణ, అభివృద్ధి, దూరదృష్టితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. ప్రతిఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గుండుగొలనులో 1992-93 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

భీమడోలు: గుండుగొలను మావులేటి సోమరాజు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1992-93 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం ఘనంగా నిర్వహించారు. దేశ, విదేశాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డ వారంతా ఒకే వేదికపైకి వచ్చి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తరగతి గదుల్లోని తమ కుర్చీల్లో కూర్చుకుని కుటుంబ సమ్మేతంగా సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి తమను ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన 13 మంది గురువులకు పాదాభివందనం చేశారు. వారికి ఆత్మీయ సత్కారం చేసి జ్ఞాపికలను అందజేశారు. తొలుత పాఠశాల భవన దాత మావులేటి సోమరాజు, స్థల దాత కొండ సీతారాజుల సేవలను స్మరించుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గురువులతో గ్రూప్ ఫొటో దిగారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కెల్లా శ్రీహరిబాబు, కె.సురేష్, కె.శ్రీనివాసరావు, బి.గౌరి, కె.చంద్రబాబు, జి.సత్యనారాయణ, జి.జనార్ధన్ తదితరులు 65 మంది పాల్గొన్నారు.

సక్రమంగా ఓటర్ల నమోదు ప్రక్రియ



సోమశేఖర్, తహసీల్దార్

ఏలూరు రూరల్ : ఏలూరు నియోజకవర్గంలో ఓటర్లు నమోదు ప్రక్రియ పక్కాగా నిర్వహించామని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. ఏలూరు కొత్తపేట 42 డివిజన్‌లో 79, 80, 82 పోలింగ్ కేంద్రాల్లో 50 మంది టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలిగించారంటూ కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన తెలిపారు. పైన పేర్కొన్న పోలింగ్ కేంద్రంలో చనిపోయిన వారి 13 ఓట్లను, ఎన్‌రోల్ అయిన 60 మంది డూప్లికేట్ ఓట్లు తొలిగించాలని ఎన్నికల సంఘానికి సిఫార్సు చేశామన్నారు. ఇతర పోలింగ్ కేంద్రాలకు లేదా నియోజకవర్గాలకు తమ ఓటు మార్పు కోరుతూ 84 దరఖాస్తులు వచ్చాయన్నారు. పైన పేర్కొన్న మూడు పోలింగ్ కేంద్రాల పరిధిలో వచ్చిన 157 (ఫారం-7) దరఖాస్తులను పరిశీలించి, పక్కా ఆధారాలు సేకరించామని వివరించారు. ఓట్లు తొలిగింపు, కొత్త ఓటర్ల గుర్తింపుపై బీఎల్‌ఓలపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం విధి, విధానాలు అనుసరించి, నియోజకవర్గం అంతటా నిష్పక్షపాతంగా ఓటర్ల నమోదు ప్రక్రియ నిర్వహించామని వివరించారు.

పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీ వివేక్ ఠాకూర్, సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

ఆగిరిపల్లి: ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యాన పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వివేక్ ఠాకూర్ తెలిపారు. గురువారం మండలంలోని ఈదర సచివాలయంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ శాఖల వారీగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ వివేక్ ఠాకూర్ మాట్లాడుతూ దేశంలో ప్రధాని మోదీ కేంద్ర పథకాలను ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టారని వివరించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పలువురు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఏలూరు జిల్లా పరిషత్ సీఈవో కేఎస్‌ఎస్ సుబ్బారావు, ఎంపీపీ గొళ్ళ అనూష, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, తహసీల్దార్ ఉదయ భాస్కర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, నియోజకవర్గ కన్వీనర్ జీఆర్‌కే రంగారావు, మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత పూళ్ల జట్టు



భీమడోలులో హోరాహోరీగా తలపడుతున్న కబడ్డీ జట్లు



పూళ్ల జట్టు క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీడీఓ, ఎస్సైలు

భీమడోలు: ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్వార్టర్, సెమీ ఫైనల్ కబడ్డీ పోటీలు భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉత్కంఠగా సాగాయి. మండల వ్యాప్తంగా ఉన్న 17 సచివాలయాల పరిధిలోని 14 కబడ్డీ టీంలు పాల్గొన్నాయి. యువ క్రీడాకారుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడలు దోహద పడతాయని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి పేర్కొన్నారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎంపీడీఓ, కోఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావులు గేమ్ నిబంధనలను వివరించారు. అనంతరం క్రీడాకారులు తమ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో ఆగడాలలంక టీంపై పూళ్ల టీం విజయం సాధించింది. ఈ టీము ఈనెల 24వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించిందని ఎంపీడీఓ తెలిపారు. క్రీడాకారులను ఎంపీడీఓ, ఎస్సై వై.సుధాకర్, పీడీలు అభినందించారు.

ప్రశాంతంగా ఆడుదాం ఆంధ్ర క్రీడలు

భీమడోలు: ఆడుదాం ఆంధ్ర మండల స్థాయిలో క్వార్టర్, సెమీ ఫైనల్ మ్యాచ్‌లు భీమడోలు ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్టు అధికారులు గురువారం రాత్రి తెలిపారు. ఆగడాలలంక, పూళ్ల జట్లకు మధ్య కబడ్డీ పోటీ హోరాహోరిగా జరిగింది. ఆగడాలలంక జట్టుపై పూళ్ల జట్టు విజయం సాధించినట్టు కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు ప్రకటించారు. అనంతరం రెండు టీములు హైస్కూల్ ఆవరణ నుంచి బయటకెళ్లారు. అక్కడే ఉన్న ఆగడాలలంక టీము మద్దతుదారుడు పంతగాని అక్షర్ అనే యువకుడు గెలిచిన జట్టు క్రీడాకారులను గేళి చేస్తూ కవ్వింపు చర్యలకు ప్రయత్నించాడు. పూళ్ల క్రీడాకారులను పరుషజాలంతో దుర్భాలాడుతూ వారిపై దాడి చేసేందుకు ప్రయత్నించి పారిపోయాడు. ఈ నేపథ్యంలో ఇరుజట్ల క్రీడాకారుల మధ్య గొడవలు జరిగాయని, పీడీలపై దాడి చేసినట్టుగా చేస్తున్న దుష్ప్రచారంలో వాస్తవం లేదని, తగాదాలు చోటుచేసుకోలేదని ఎస్సై వై.సుధాకర్, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. పోటీలు స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్వల్ప వివాదానికి కారణమైన ఆగడాలలంక గ్రామానికి చెందిన అక్షర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.